29న శాస్త్రీయ నృత్య, సంగీత పోటీలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఈ నెల 29వ తేదీ నుండి రాష్ట్ర స్థాయి లలిత సంగీత, శాస్త్రీయ నృత్యం, తెలుగు సినిమా పాటల పోటీలను కళాంజలి సంస్కృతిక సంస్థ నిర్వహించనున్నట్లు ఎస్.కళాంజలి, కార్యదర్శి విజయ కళ్యాణ్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. గాయకుడు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతిని పురస్కరించుకొని శాస్త్రీయ లలిత భక్తి పాటలు, సినిమా పాటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అమరగాయకులు ఘంటసాల, ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం, ఇతర సినీ గాయనీమణులు గానంచేసిన పాటలు పాడవచ్చునని, మహిళలు, సినీ గాయనీమణులు పాటలు పాడవచ్చునని తెలిపారు. కనీసం 25 మందికిపైగా పాల్గొనే సినిమా పాటల పోటీల అంశంలో నగదు బహుమతులను విజేతలకు పంపిణీ చేస్తామన్నారు. ప్రతి అంశంలో 5 స్థానాలలో విడివిడిగా షీల్డుతోపాటు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. నగదు బహుమతులుగా ప్రథమ విజేతకు రూ.3 వేలు, ద్వితీయ బహుమతి రూ.2 వేలు, తృతీయ బహుమతి రూ.వెయ్యి, కన్సోలేషన్ స్థానాల్లో ఇద్దరికి రూ.500 చొప్పున నగదు అందజేస్తామని పేర్కొన్నారు. సుదూర జిల్లాల కళాకారులు వారి రాకను 9490884300, 9966767733 నంబర్లకు ఫోన్ ద్వారా తెలపాలన్నారు.

సృజన ఆత్మహత్యకు గల కారణాలు వెల్లడించాలి

- ఉత్తప్ప కుటుంబానికి రక్షణ కల్పించాలి
- సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి పట్టణంలోని మిట్టవాండ్లపల్లికి చెందిన సృజన ఆత్మహత్యకు గల కారణాలను పోలీసులు వెల్లడించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం నాయకులు సృజన తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను పరామర్శించి సృజన ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉత్తప్ప కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలను మీడియాకి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాటా్లడుతూ ఉత్తప్ప, తారకరత్న రెండు కుటుంబాలు మిట్టవాండ్లపల్లెలో నివాసం ఉండే దూరపు బంధువులని తెలిపారు. వీరి మధ్య రెండు సంవత్సరాల ముందు చిన్న తగాదాలు ఉంటే తారకరత్న దారి కాచి ఉత్తప్పను కొట్టడని, అక్కడున్న స్థానికులు అడ్డుకోవడంతో ఉత్తప్పకు తారకరత్న నుండి ప్రాణాపాయం తప్పిందని పోలీసులు తారకరత్న మీద బైండోవర్ కేసు చేశారన్నారు. తారకరత్న పేరుకు ఇంజినీరింగ్ చదివినా అల్లరిగా, కొంతమంది అల్లరిమూకల్తో తిరిగేవాడని వాళ్ల పెద్దమ్మతో కూడా ఘర్షణలు జరిగాయని తమ విచారణలో వెల్లడి అయిందన్నారు. రెండు సంవత్సరాల నుండి అప్పటి ఘటన మనసులో పెట్టుకున్న తారకరత్న సృజన ఆత్మహత్యకు రెండు రోజుల ముందు కూడా ఉత్తప్ప మీద అటాక్ చేసే భయభ్రాంతులకు గురిచేసే అటు ఉత్తప్పను ఆమె కుమార్తె సృజనను బయపెట్టినట్లు బాధితులు తెలిపారు. కొంతమంది సృజనకు ఫోన్ చేసి మీ నాన్న కత తేలుస్తామని బెదిరించిన విషయాన్ని స్వయంగా ఉత్తప్ప వెల్లడించారని ఇటీవల పదవ తరగతి పాస్ అయిన సృజన డాక్టర్ కావాలనుకున్నట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారని పేర్కొన్నారు. సున్నితమనస్కురాలైన ఆమె భయభ్రాంతులకు లోనై ఆత్మహత్య చేసుకున్నట్లు బావిస్తున్నామని అయితే ఫోన్ కాల్ ఆధారంగా మరింత విచారణ చేసి సృజన ఆత్మహత్యకు కారణాలు వెల్లడించాలని తెలిపారు. సృజన మరణంతో తారకరత్న మీద కేసు పెట్టిన కారణంగా జైలు నుండి వచ్చిన తర్వాత ఉత్తప్ప కుటుంబాన్ని లేకుండా చేస్తానని తారకరత్న చెప్పినట్లు ప్రచారం జరుగుతుందని ఒక వైపు బిడ్డను కోల్పోయి బాధలో ఉన్న కుటుంబానికి వచ్చే బెదిరింపుల నివారించి వారికి పోలీసులు అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో ఉత్తప్ప కుటుంబ సభ్యులతో పాటు సిపిఎం నాయకులు రామాంజులు, రామచంద్ర పాల్గొన్నారు.

ఉత్తప్ప కుటుంబాన్ని పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

ఉద్యోగోన్నతులు కల్పించి బదిలీలు చేయాలి

- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజు

ప్రజాశక్తి-మదనపల్లె

ఉద్యోగోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీలు చేపట్టాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గుడి నాగరాజు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం జారీ చేసిన జిఒ 5ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం కురబలకోట మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ధర్నా చేపట్టి నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసన అనంతరం ఎంపిడిఒ గంగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు సీనియారిటీ, రోస్టర్ జాబితా మేరకు ప్రమోషన్స్ కల్పించిన తర్వాతే బదిలీలు చేయాలని కోరారు. ప్రభుత్వం జారీ చేసిన జిఒ నంబర్ 5 ద్వారా సచివాలయ ఉద్యోగుల బదిలీలు, రేషనలైజేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ జిఒ ప్రకారం ఉద్యోగులకు సొంత మండలంలో పోస్టింగ్ ఇవ్వకూడదనే నిబంధన ఉద్యోగులను తీవ్రంగా నిరాశకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ జీతాలతో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులు ఇతర మండలాలకు బదిలీ కావడం వల్ల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. జిఒ 5ను వెంటనే రద్దు చేసి, సొంత మండలాల్లోనే ఉద్యోగులను నియమించాలని కోరారు. రేషనలైజేషన్ అనంతరం మిగిలిన ఉద్యోగుల్ని ఎక్కడ నియమించనున్నారన్న విషయమై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగుల్లో భయాందోళన నెలకొందన్నారు. సర్వీసు ప్రారంభించి ఐదేళ్లు పూర్తైనా ఇంకా జాబ్‌ఛార్ట్ లేకపోవడం, ఎవరు ఏ పని చేయాలో తెలియక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. వెంటనే జాబ్‌ఛార్ట్ విడుదల చేయాలని, ప్రమోషన్ ఛానల్ ఏర్పాటైన తరువాతే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జాయినింగ్ తేదీ ఆధారంగా రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ప్రొబేషన్ ఆలస్యం కారణంగా నష్టపోయిన ఆరియర్స్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, జెఎసి నాయకులు గణేష్, మదన్ మోహన్‌రెడ్డి, ఆనంద్, రేణుక, శ్రీవాణి, రమేష్ రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సచివాలయం ఉద్యోగులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఎపి గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామయ్య

డిపిఒకు సమస్యలు చెప్పుకుంటున్న పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి-పీలేరు

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధనాసి వెంకటరామయ్య అన్నారు. మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి ఎ.రాధమ్మ గ్రామ పంచాయతీ కార్యాలన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు ఆమెకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు అనుకూలంగా 2023 జూన్ 27న హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రపోజల్ పద్ధతిని అమలు చేయాలని హైకోర్టు ఇచ్చి తీర్పులో మస్టర్‌రోల్ అమలు చేయాలని కోరారు. కార్మికులకు వేతనాలు పెంపుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేతనాలు నెలనెలా చెల్లించేలా పంచాయతీ అధికారులను ఆదేశించాలని కోరారు. విధి నిర్వహణలో ఉంటూ గాయపడిన లేదా అనారోగ్యం పాలైన కార్మికులకు పూర్తి వేతనాన్ని చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అందించే సోపులు, నూనె, ఇతర వస్తువులు క్రమం తప్పక ఇచ్చేలా చూడాలని కోరారు. కార్మికులందరి పీఎఫ్, ఇఎస్ఐ సమస్యలు పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల పీఎఫ్, ఇఎస్ఐ, ఇతర సంక్షేమ పథకాలను సకాలంలో వర్తించేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీలేరు గ్రామ పంచాయతీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటరమణ, ఓబులయ్య, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

హామీలను మరిచిన కూటమి ప్రభుత్వం : డిసిసి

ప్రజాశక్తి - రాయచోటి

మాట్లాడుతున్న గాజుల భాస్కర్

ఎన్నికల ముందు ప్రజలకు హామీలతో మాయ చూపించి, అధికారంలోకి వచ్చాక వాటిని పక్కన పెట్టడం కూటమి ప్రభుత్వానికి అలవాటైపోయిందని డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం డిసిసి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవలం ఏడాది పాలనలోనే తాము సుపరిపాలన అందించామని చెప్పుకోవడం ప్రజలను మోసగించే ప్రయత్నం మాత్రమేనని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. టమోటా, మామిడితో పాటు ఇతర పంటలకు కనీస మద్దతు ధర లేక రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. మామిడి రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర రూ.12 నిర్ణయించినప్పటికి దళారులు కేవలం రూ. 3-4 లకే కోనుగోలు చేస్తామని ఖరా ఖండిగా చెప్పడంతో రైతులు లబోదిబోమంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పట్టణా భివృద్ధి శాఖ మంత్రి పోంగూరు నారాయణ కేవలం అమరావతి పట్టణానికి మాత్రమే పరిమితమ య్యారన్నారు. జిల్లాలో రాయచోటి, రాజంపేట, మదనపల్లిలో డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినిందని, చిన్న వర్షానికే నదులుగా మారుతున్న వీధులు ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నాయని అన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తన బాధ్యతల్ని పూర్తిగా విస్మరించా రన్నారు. మహిళలకు, అధికారులకు ప్రాధాన్యతే లేకుండా పోయిందిన్నారు. రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాలలో రోడ్డు ప్రమాదాల పరిస్థితి అత్యంత విషమంగా ఉంది రోజూ ప్రమాదాలు జరుగుతున్నా వాటిని నివారించేందుకు ప్రభుత్వం సరైన సన్నాహాలు చేయలేదని పేర్కొన్నారు. రాయచోటి - పింఛా రోడ్డు మార్గం అత్యంత దయనీయమైన పగిలిన రోడ్లపై ప్రజలు నిత్యం ప్రయాణిస్తూ అవస్థలు పడుతున్నారని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఉన్న జాబులే తీసేస్తూ ఇంకా ఎక్కువ మంది నిరుద్యోగులును సృష్టిస్తోంది అని తెలిపారు. ఈ వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువచ్చే బాధ్యత ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీదేనని, తాము ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు.

పంచాయతీ బోరును తొలగించి, దానిపై నిర్మించిన రూములు

పంచాయతీ బోరు తొలగింపు

- నిద్రమత్తులో పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పట్టణంలోని తరిగొండ రోడ్డుకు ఆనుకొని ఉన్న పాత ఇందిరమ్మ కాలనీలో కొంత మంది గుట్టుచప్పుడు కాకుండా పంచాయతీ బోరు తొలగించినా పంచాయతీ అధికారులు నిద్రమత్తులో జోగుతుండడంపై సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఐదు దశాబ్దాల క్రితం కాలనీ ఏర్పాటైందని ఇక్కడి ప్రజలు తెలుపుతున్నారు. ఇక్కడ పంచాయతీ బోరు తవ్వించి తాగునీటి సౌకర్యం కల్పించింది. కరువులో సైతం ఇక్కడ ఉన్న బోరుబావిలో చేతిపంపు ద్వారా ఇక్కడ వాసులు నీరు తీసుకొని పోయేవారు. కొన్ని రోజుల క్రితం గుట్టుచప్పుడు కాకుండా బోరుబావిని తొలగించి, షాపు రూములను ఏర్పాటు చేశారు. తాగునీటి కొరత ఏర్పడిందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ బోరును తొలగించి, షాపు రూములు నిర్మించినా పంచాయతీ అధికారులకు తెలియకపోవడంపై, అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారనే విమర్శలు అనేకం వినిపిస్తున్నాయి.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనమవుతుందని ఎక్సైజ్ సిఐ ఎం.మల్లిక విద్యార్థులకు సూచించారు. మంగళవారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత అధ్యక్షతన, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిక, కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వలన మానసిక, శారీరక రుగ్మతలకు లోనవుతారని, చదువులోనూ వెనకబడి అధోగతి పాలవుతారని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల సేవనం వలన సామాజికంగా, ఆర్థికంగా చతికిల పడతారని సూచించారు. కార్యక్రమంలో కావ్యనిర్వహణ అధికారి వై.ప్రదీప్, ఎన్ఎస్ఎస్ యూనిట్ బృందం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

అప్పు తీర్చినా ఖాళీ చెక్కులతో వేధింపులు

- న్యాయం చేయాలని బాధితురాలి ఆవేదన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వడ్డీ వ్యాపారుల ఆగడాలపై వివరిస్తున్న గౌరీ

మదనపల్లెలో వడ్డీ రాకాసురులు రెచ్చిపోతున్నారు. అవసరానికి రూ.లక్ష అప్పు చేస్తే రూ.10 లక్షలు వడ్డీ వసూలు చేసి, ఇంకా అప్పు తీరలేదని వేధింపులకు గురి చేస్తున్నారంటూ మదనపల్లె రెడ్డీస్ కాలనీలో కాపురముంటున్న కారు డ్రైవర్ నటరాజ భార్య గౌరీ ఆరోపించారు. మంగళవారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో వడ్డీ వ్యాపారుల ఆగడాలపై మీడియాకు తన గోడును వెల్లబోసుకొని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ సందర్భంగా బాధితురాలు గౌరీ మాట్లాడుతూ అప్పుకు వడ్డీలు వందరెట్లలో వసూలు చేసి, ఖాళీ చెక్కులు తీసుకుని కోర్టులో కేసు వేసి వడ్డీ కోసం మా రక్తం పీల్చేస్తున్నారన్నారు. వడ్డీ రాకాసురుల నుండి రక్షణ కల్పించమని పోలీసుస్టేషన్‌కి వెళితే న్యాయం చేయలేదని కంటతడి పెట్టుకున్నారు. ఇంట్లో ఒంటరిగా సమయంలో వచ్చి ఎక్కడ పడితే అక్కడ తాకి లైంగికంగా వేధిస్తున్నారని, వ్యభిచారం చేసి అప్పు తీర్చమని బాధిస్తున్నట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తమ ఫొటోలు పెట్టి పరువు తీస్తున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని వాపోయారు.

పాలిసెట్ ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎపి పాలిసెట్‌కు సంబంధించి విద్యార్థుల ర్యాంకుల వారీగా మంగళ వారం స్థానిక జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువప త్రాల పరిశీలన చేపట్టినట్లు పాలిసెట్ వెరిఫికేషన్ ఇన్‌ఛార్జి నూరుల్లా, కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన 28వ తేదీ వరకు కొనసా గుతుందన్నారు. 80 మంది విద్యార్థులకు ఐసిఆర్ ఫారమ్‌ను అంద జేశామని పేర్కొన్నారు. ధ్రువపత్రాలు ఏవైనా పెండింగ్‌లో ఉంటే వాటిని 28వ తేదీలోగా అభ్యర్థులు సమర్పిస్తే వారికి వెరిఫికేషన్ పూర్తి చేసి ఐసిఆర్ ఫారమ్‌ను అందజేస్తామన్నారు. సంబంధిత ధృవీకరణ పత్రాలను వచ్చే నెల మూడో తేదీ లోపు కూడా హెల్ప్‌లైన్ సెంటర్లలో అందజేయవచ్చని తెలిపారు. అదే ఆఖరి తేదీ అని, ఈలోపు సంబంధిత పత్రాలను సిద్ధం చేసుకోనివారికి పాలిటెక్నిక్‌లో చేరిన అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చే ఫీజురీయిం బర్స్‌మెంట్ అందదని పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో స్పందించి వెరిఫికేషన్ సెంటర్‌కు ఉదయం 9 గంటల పైన చేరుకొని తమ పత్రా లను ధ్రువీకరించుకొని ఐసిఆర్ ఫారమ్‌ను పొందాలని సూచించారు.

ఐసిఆర్ ఫారమ్ తీసుకుంటున్న విద్యార్థి

రేపు ఫెన్సింగ్ ఎంపికలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఈ నెల 26వ తేదీన ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్ 10, 12 బాలబాలికల ఫెన్సింగ్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఫెన్సింగ్ సంఘం జిల్లా కార్యదర్శి ఎ.చంద్రకళావతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన వారు ఈనెల 29న విజయవాడ డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా జట్టు ఎంపికలలో పాల్గొనే క్రీడాకారులు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి వ్యక్తిగత రిజిస్ట్రేషన్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో పాటు తమ వ్యక్తిగత ఫెన్సింగ్ పరికరాలతో హాజరుకావాలని సూచించారు. అండర్-10 క్రీడాకారులు 2016 జనవరి ఒకటిన కానీ తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. అండర్-12 క్రీడాకారులు 2014 జనవరి ఒకటిన లేదా ఆపై జన్మించి ఉండాలని సూచించారు. ఇతర వివరాలకు 9490863917, 9440246618 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆటలు ఆడాలి.. ఆనందంగా ఉండాలి

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

ఆటలు ఆడాలి.. ఆనందంగా ఉండాలని క్రీడా భారతి జాతీయ కార్యదర్శి మధు మేఘనాథ్ అన్నారు. మంగళవారం మదనపల్లె రెడ్డీస్ కాలనీలోని ఎస్వీవీ స్పోర్ట్స్ అరేనాలో నిర్వహించిన అన్నమయ్య జిల్లా క్రీడా భారతి సమావేశానికి జాతీయ క్రీడా భారతి సహ కార్యదర్శి మధుమేఘనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడను ప్రోత్సహించాలన్నారు. క్రీడల వల్ల శారీరక ధారుఢ్యం, మానసిక ఉల్లాసం, ఆరోగ్యం లభిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా కేంద్ర కమిటీలు ఏర్పాటు చేసి, క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా అసోసియేషన్‌లతో మమేకమై ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం మధుమేఘనాథ్‌ను మదనపల్లె కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్రీడా భారతి రాష్ట్ర కార్యదర్శి ధనంజయరెడ్డి, సహ కార్యదర్శి సురేంద్ర, జిల్లా క్రీడా భారతి అధ్యక్ష, కార్యదర్శులు, దిలీప్, నరేష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ విజయకుమార్, విష్ణు చైతన్య, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మురళీధర్, మదనపల్లె కేంద్ర కార్యదర్శి బాలాజీ, షూటింగ్ బాల్ గోల్డ్ మెడలిస్ట్ యూసఫ్, బ్యాడ్మింటన్ కోచ్ మహేంద్ర, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, బాలాజీ, చలపతి రెడ్డి, మణి, గురు పాల్గొన్నారు.

చదువుతోపాటు సంస్కారం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్: విద్యార్థులు చదువుతోపాటు సంస్కారం కూడా అలవర్చు కోవాలని విజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు సూచించారు. మండల పరిధిలోని మందరం కొత్తపల్లి ఎంపిపి పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే గొప్ప నడవడి అలవర్చు కుని మహోన్నత స్థాయికి ఎదగాలన్నారు. చదువు మీద మక్కువతో కష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు, ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో విజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షులు పట్టుపోగుల ఆదినారాయణ, కార్యదర్శి షేక్ అబ్దుల్లా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ జైలులో సీనియర్ సివిల్ జడ్జి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - రాయచోటి: కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని సూచనల మేరకు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను మంగళవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇచ్చారు. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో రాయచోటి సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.

మొరవపల్లిని సందర్శించిన అధికారులు

ప్రజాశక్తి-మదనపల్లె: పట్టణానికి సమీపంలో ఉన్న మొరవపల్లి గ్రామంలోని 27 కుటుంబాలకు ఇప్పటికీ ఆధార్ కార్డులు లేనట్లు వెలుగులోకి వచ్చింది. సోమవారం మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన బాషా నిర్వహించిన ప్రజాదర్బార్‌లో బసినికొండకు చెందిన తెలుగు దేశం పార్టీ నాయకుడు యుగంధర్ చొరవతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతోవెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎంపిడిఒ తాజ్ మస్రూర్, తహశీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డి, విఆర్ఒ మహేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఐసిడిఎస్, ఆరోగ్యశాఖ సిబ్బంది, సచివాలయ ఉద్యోగుల బృందం మొరవపల్లి గ్రామాన్ని సందర్శిం చింది. ఈ సందర్భంగా వారు గ్రామ పరిస్థితిని సమీక్షించారు. గ్రామంలో 27 కుటుంబాలకు ఇప్పటి వరకు ఆధార్ కార్డులు లేని విషయం నిర్ధారించగా 20 పైగా ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ లేవని సుమారు 40 మంది చిన్నారులు పాఠశాలలకి దూరంగా ఉన్నారని అధికారులు తెలిపారు. తల్లికి వందనం, పక్కా ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలు కూడా ఈ గ్రామానికి అందలేదని వెల్లడించారు. గ్రామ ప్రజలు అనాగరిక పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారని, ఇది గత పదేళ్లుగా వైసిపి పాలనలో గ్రామ అభివృద్ధికి జరిగిన నిర్లక్ష్యం సంకేతమని తెలుగుదేశం నాయకులు మీడియాతో అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కార్తీక్, బొగ్గుల నరసింహులు, బొగ్గుల దుర్గా, మునీంద్ర, రమేశ్, కిషోర్, శివ, అభి పాల్గొన్నారు.

గ్రామస్తులను విచారిస్తున్న అధికారులు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

ఉర్దూ భాషను సులభంగా నేర్చుకోవచ్చు

ప్రజాశక్తి - రాయచోటి

తెలుగు, ఇంగ్లీష్ మీడియాల్లో ఉర్దూ ప్రథమ భాషగా ఎంచుకున్న విద్యార్థులకు ఉర్దూ భాషను సులభంగా నేర్చుకొనే పుస్తకాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం మంగళవారం తమ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం అజీజియ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ తరపున ప్రచురించారని తెలిపారు. రచయిత అబ్దుల్ వహీద్ పిల్లలకు, పెద్దలకు సులభంగా ఉర్దూ భాష నేర్చుకునే విధంగా పుస్తకాన్ని తయారు చేశారని పేర్కొన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఇలాంటి పుస్తకాలు విద్యార్థులకు చాలా అవసరమని, భాష అందరికీ చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరూ ఉర్దూ భాషను సులభంగా నేర్చుకుంటారని ఈ సందర్భంగా రచయితను ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ స్టేట్ కన్వీనర్ షేక్ మొహమ్మద్, పాలెం రాజా, గోపాల్, బాబా ఫక్రుద్దీన్,సురేష్ బాబు పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి

- టిడిపి జిల్లా అధ్యక్షులు 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు అన్నారు. మంగళవారం రాజంపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు భరోసాగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతుందని తెలిపారు. ఒక కుటుంబంలో ఆరోగ్యం కోసం భారీగా ఖర్చు చేసి అప్పుల పాలై అవస్థలు పడుతున్న అలాంటి బాధిత కుటుంబాలకు సిఎం సహాయనిధి ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. ఆలూరు రాములమ్మకురూ.43,230, చమర్తి జయలక్ష్మమ్మకు రూ.65 వేలు, కొండూరు సుభద్రకు రూ.24,746, దొడ్డిపల్లి మల్లిఖార్జునకు రూ.18 వేలు, పూసలదేవి సుబ్బరాజుకు రూ.1,03,080 సిఎం సహాయనిది చెక్కులు అందుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ చికిత్స కోసం అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నామని, అలాంటిది తమకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జగన్ మోహన్‌రాజు సహాయం చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట టిడిపి అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి కొల్లి రెడ్డయ్య నాయుడు, కొండ శీను, పోలి చెరువు ప్రెసిడెంట్ నాగినేని నాగేశ్వర్ నాయుడు, రాంనగర్ నరసింహ, మేక నరసింహులు, శ్రీహరి, నాగేంద్ర, ఆనంద్, పలువురు టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కులు అందజేస్తున్న జగన్మోహన్‌రాజు

మాట్లాడుతున్న శివప్రసాద్‌రెడ్డి

నిరుద్యోగ యువతకు వెన్నుపోటు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్రంలో నిరుద్యోగయువతకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు యలగ వర్ల శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత కోసంనిరుద్యోగులతో యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పేరుకు పోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకాక యువతకు, ఉద్యోగం లేదు భృతి లేదు భవిష్యత్తు లేదని, రాష్ట్రంలో నిరుద్యోగులకు శఠగోపం పెట్టడంలో కూటమి ప్రభుత్వానికి తిరుగులేదని విమర్శించారు. ముఖ్యంగా ప్రతి నిరుద్యోగికి రూ.3వేలు భృతి ఇస్తా మని వాగ్దానం కాదా అని ఆయన కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ హ్ రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాలో యువత పోరు కార్యక్రమం విజయవంతం మైందని నిరుద్యోగులు ఎంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి వారి గొప్పతనాన్ని చాటారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల సానుభూతి ప్రకటించి వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు.

వైద్యాధికారులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కెవిపల్లి

డాక్టర్ శ్రీగీష డాక్టర్ రమేష్‌రెడ్డి

మండలంలోని గ్యారంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిగా డాక్టర్ రమేష్ రెడ్డి, తలుపుల పిహెచ్‌సి వైద్యాధికారిగా డాక్టర్ శ్రీగీష మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వీరు మండల పరిధిలోని తలుపులలో గత ఐదు సంవత్సరాలుగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందించిన డాక్టర్ రమేష్‌రెడ్డి, కె.వి పల్లి మండలం లోని గ్యారంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీపై వెళ్లారు. సదుం మండలంలో చేరుకూరుపల్లె పిహెచ్‌సిలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎల్.శ్రీగీష తలుపుల పిహెచ్‌సికి బదిలీపై వచ్చారు. డాక్టర్ శ్రీ గీష్మకు పిహెచ్‌సిలోని వైద్య ఆరోగ్య అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎంపిడిఒకు వినతి పత్రం ఇస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

మార్గదర్శకాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-కలికిరి

ప్రమోషన్ చానల్ పై ఉద్దేశిత మార్గదర్శక విడుదలైన తర్వాతనే బదిలీలు చేపట్టాలని ఎ.పి.ఎస్.ఇ.ఎ(అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్) ఆధ్వర్యంలో ఎంపిడిఒకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన రేసనలైజేషన్ లో భాగంగా రెండు లేదా మూడు సచివాలయాలకు కలిపి ఒక క్లస్టర్ చేసే ఉన్నారని అందువలన క్షేత్రస్థాయిలో పలు ఇంజినీరింగ్ విభాగాలలో పనులు చేసే మాపై పని ఒత్తిడి తీవ్రంగా పెరుగుతుందని అన్నారు. ఇద్దరు చేయవలసిన పనిని ఒక్కరే చేయవలసి వస్తుందని, ఇది ఆర్టికల్ 14 పూర్తిగా విరుద్ధమని వారి దృష్టికి తెచ్చామన్నారు. 2025 బదిలీలకు సంబంధించిన జి.ఒ. నెంబర్ 5ను ప్రభుత్వం విడుదల చేశారని, రేసనలైజేషన్లో భాగంగా మిగులుగా చూపిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఏ విధంగా గుర్తించునున్నారు, మిగులుగా గుర్తించిన ఇంజ నీరింగ్ పోస్టింగ్‌లు ఎక్కడ ఇవ్వనున్నారనే విషయాలపై స్పష్టతనివ్వాలని అన్నా రు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వెంకటేష్, చక్రి, అశోక్ పాల్గొన్నారు.

యువతపోరు చేసే అర్హత వైసిపికి లేదు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

యువతను అన్ని విధాల దగా చేసిన వైసిపికి యువత సమస్యలపై పోరు చేసే అర్హత కోల్పోయిందని టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్ పేర్కొన్నారు. 2018లో ఆరు లక్షల మందికి "నిరుద్యోగ భృతి" ఇస్తే వైసిపి అధికారంలోకి రాగానే ఒక్క కలం పోటుతో రద్దు చేసిన జగన్, ఈరోజు నిరుద్యోగ భృతి ఇంకా ఇవ్వలేదని ధర్నా ఎంటని ప్రశ్నించారు. వైకాపా ప్రభుత్వంలో ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వలేదని, టిడిపి వచ్చి 17వేల టీచర్ ఉద్యోగాలు ఇస్తుంటే కొన్ని లక్షల ప్రయివేట్ ఉద్యోగాలు వస్తుంటే వైసిపి ధర్నా చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

- ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ శ్యామలరావు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

తల్లి జన్మనిస్తే రక్తదాత పునర్జన్మ ఇస్తారని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్ పేర్కొన్నారు. పులివెందుల ప్రాంతంలోని స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని స్టేట్ బ్యాంక్ (మెయిన్) చీఫ్ మేనేజర్ శ్యామల రావు, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నవీన్, డాక్టర్ రాజేశ్వరి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు దాదాపు 30 మంది రక్తదానం చేసిన ఆయా బ్యాంక్ మేనేజర్లు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందనలు తెలిపి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పులివెందుల టౌన్ శాఖ మైనేజర్, జెఎన్‌టియు ఎస్‌బిఐ శాఖ నుండి పవన్‌కుమార్ రెడ్డి, కోమన్నూతల ఎస్‌బిఐ శాఖ నుండి ఓబులేసు, రక్తనిధి సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం గురించి మాట్లాడే హక్కు జగన్‌కు లేదు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజా స్వామ్యం గుర్తుకు రాలేదా అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. మానవత్వం గురించి మాట్లాడే హక్కు జగన్ కు లేదన్నారు. స్థానికంగా తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు జి.ఒ. నెంబర్ ఒకటి తెచ్చినప్పుడు ప్రజాస్వామ్యం మరచి పోయారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పరామర్శించే హక్కు, ఏ ప్రాంతానికి వెళ్లాలన్నా ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కూటమి ప్రభుత్వం అక్రమ నిబంధనలు పెట్టి ఇబ్బందులు పెడుతోందని జగన్ పేర్కొనడం సరికాదన్నారు. జి.ఒ. నంబర్ ఒకటి తెచ్చి చంద్ర బాబు బెంగళూరు నుంచి కుప్పం వస్తు ఉంటే కర్ణాటక సరిహద్దుల్లో పోలీసులు, అధికారులను అడ్డు పెట్టుకుని రానీయకుండా రాత్రంతా డ్రామా చేయడం సమంజసమా అని ప్రశ్నించారు.

CHANGE OF NAME

I Vathalur Sai Kumar Reddy (old name) S/o V karunakar Reddy R/o 7/105, Thambillavaripalli, Anantarajupeta, Rlykodur Mandal, Annamaiah Dt.

I have changed my name to Vathaluru Sai Kumar Reddy S/o Karunakar Reddy (New name).

శక్తి యాప్‌తో బాలికలకు భరోసా

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మహిళలు, బాలికలకు శక్తి యాప్ ఒక భరోసాను కల్పిస్తుందని మదనపల్లి శక్తి బృందం ఇన్‌ఛార్జి ఎస్ఐ గాయత్రి నేతృత్వంలోని బృందం తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల బాల, బాలికలకు ప్రిన్సిపల్ కె.శ్రీధర్ తో కలసి శక్తి బృందం శక్తి యాప్ వినియోగంపై, మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, బాలికల భద్రత కోసం ప్రభుత్వం శక్తి యాప్ అందుబాటులోకి తీసుకువచ్చిందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ స్మార్ట్ ఫోన్‌లో ప్లే స్టోర్ ద్వారా శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకో వాలన్నారు. అత్యవసర సమయాల్లో శక్తి యాప్‌ను ఉపయోగించడం ద్వారా తక్షణం సహాయాన్ని పొందవచ్చని అన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, పురుషుల నుంచి మహిళలు ఇబ్బందులు ఎదుర్కొనే సమయంలో శక్తి యాప్‌ను ఉపయోగించవచ్చు అన్నారు. మహిళల పట్ల పురుషులు గౌరవం కలిగి ఉండాలని, లేకుంటే ఆటువంటి వారికి తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. విద్యార్థులు కళాశాలలో సత్ప్రవర్తన కలిగి ఉండాలని, తోటి విద్యార్థుల పట్ల స్నేహ స్వభావంతో మెలగాలన్నారు. తల్లి దండ్రుల శ్రమను గుర్తించి ఉన్నత చదువులు అభ్యసించి భవిష్యత్తులో తమ లక్ష్యాలను చేరు కోవాలని సూచించారు. ప్రేమ మోజులో పడి ఉన్నత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అన్నారు. ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఆకతాయిల నుంచి అనుకోని సంఘటనలు ఎదురైన సమయంలో శక్తి యాప్‌ను లేదా 100కు సమాచారం అందించాలన్నారు. కళాశాలలోని విద్యా ర్థులు సత్ప్రవర్తనలో ఉండేలా ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు బాధ్యత వహించా లన్నారు. తరచూ నిమ్మనపల్లి పోలీసులు కళాశాలను సందర్శిస్తూ విద్యార్థుల ప్రవర్తనను, కళాశాల పరిసరాలను తనిఖీ చేస్తున్నారని వివరించారు. విద్యార్థులు బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకుండా సత్ప్రవర్తనతో ఉంటూ తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీధర్, ఎన్ఎస్ఎస్ పిఒ రామానుజులు, శక్తి బృందం కానిస్టేబుల్లు మణికంఠ, ముని నాయక్, వీణా కుమారీ, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ట్రిపుల్‌ఐటికి జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

స్నేహ వాసవి

ట్రిపుల్‌ఐటికి నిమ్మనపల్లి జడ్‌పి(తెలుగు) విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానో పాధ్యా యులు అంజాద్ అలీఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్మనపల్లి జడ్‌పి హైస్కూల్ (తెలుగు) నుంచి ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కు లతో ఉత్తీర్ణులై, మండల టాపర్లుగా నిలిచిన ఎం.స్నేహ, వై.వాసవి ట్రిపుల్‌ఐటిలో సీట్లను సాధించినట్లు తెలిపారు. ఒంగోలు లోని ట్రిపుల్‌ఐటికి వీరు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ట్రిపుల్‌ఐటిలో సీట్లు సాధించి పాఠశాలకు గుర్తింపు తెచ్చిన విద్యార్థులను పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధనలో సహకరించిన, విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. జడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు ఉత్తమ విద్యతోపాటు, క్రమశిక్షణ కలిగిన ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, క్రీడల శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను జడ్‌పి హైస్కూల్ (తెలుగు) లో చేర్పించి ఉత్తమ విద్యను అందించాలని కోరారు.

కలికిరి నుంచి ఏడుగురు విద్యార్థులు..

కలికిరి: ట్రిపుల్‌ఐటికి ఏడుగురు జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థినిలు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సోమశేఖర్ తెలిపారు. పదవ తరగతి పరీక్షల అత్యధిక మార్పులు సాధించిన ఏడు మంది విద్యార్థులు రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పాఠశాల నుంచి లక్ష్మీప్రియ, ఎల్.దివ్య, వి.కావ్యశ్రీ, జేలతాశ్రీ, కావ్యశ్రీ, సుధా, రెడ్డిశృతి ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

నందలూరు నుంచి ఐదుగురు..

నందలూరు : మండలం నుంచి ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్‌ఐటికి ఎంపికయ్యారు. పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు మణిదీప్, షణ్ముఖ శ్రీనివాసఎంపికయ్యారు. ఈ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభ అవార్డులు కూడా అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవిలత, ఉపాధ్యాయులు, పాటూరు గ్రామ ప్రజలు విద్యార్థులను అభినందించారు. మహాత్మ జ్యోతి బాపులే బిసి గురుకుల పాఠశాల కు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపిక అయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వరి తెలిపారు. వెంకట శైలజ, ప్రణవి ఆర్కే వ్యాలీకి ఎంపిక కాగా కాశి, విశాలాక్షి నూజివీడుకు ఎంపిక అయినట్లు తెలిపారు.

'వివేకానంద' విద్యార్థులు

మదనపల్లె : స్థానిక మాయాబజార్‌లోని వివేకానంద మున్సి పల్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతి ష్టాత్మక ట్రిపుల్ ఐటిలో ప్రవేశం పొందారు. మొదటి విడతలో ఈ పాఠ శాల నుంచి హర్షవర్ధన్, పురం కృతిక ఎంపికయ్యారు. వీరిలో హర్షవర్ధన్ 575 మార్కులు, కృతిక 573 మార్కులతో పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రధానో పాధ్యా యులు రాజేంద్రబాబు, ఉపాధ్యాయులు, పాఠ శాల విద్యార్థులను అభినం దించారు.

పాలిటెక్నిక్ సెమిస్టర్ ఫలితాల్లో సత్తాచాటిన శ్రీసాయి విద్యార్థులు

ప్రజాశక్తి-రాయచోటి

కార్తీక్ సనా ఇరగమ్మ ప్రవీణ్ కుమార్

పట్టణంలోని శ్రీసాయి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరం నాలుగవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి, అత్యధిక ఉత్తీర్ణత సాధించారని శ్రీసాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం నుంచి ఎం.హరిణి 98 శాతంతో మొదటి ర్యాంకు, వై.కార్తీక్, పి.సన 96 శాతంతో రెండో ర్యాంకు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం నుంచి ఎన్.ఇరగమ్మ 95శాతంతో మొదటి ర్యాంకు, ప్రవీణ్‌కుమార్ 91.3శాతంతో రెండవ ర్యాంకు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం నుంచి బి.సుమంత్ నాయక్ 83.7శాతంతో మొదటి ర్యాంకు, జి.వేణు వర్ధన్ 81.6 శాతంతో రెండవ ర్యాంకు, సివిల్ ఇంజినీరింగ్ విభాగం నుంచి బి. యశోద 84.5 శాతంతో మొదటి ర్యాంకు, బివెంక శివమ్మ 77శాతంతో రెండవ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కన పరిచిన విద్యార్థులను, ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను అభినందిస్తూ ప్రతి ఒక్కరికి ఉద్యోగ ఉపాధి భరోసా కల్పించడానికి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకితభావంతో కృషి చేయాలని, క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.వెంకటరమణ, పాలిటెక్నిక్ ఇన్‌ఛార్జి వి.ప్రతాపరావు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

మెగా పేరెంట్స్‌డేను విజయవంతం చేయండి



విద్యార్థులతో మాట్లాడుతున్న లోకేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలను డివైఇఒ వై.లోకేశ్వ ర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి చర్చ జరిపి వారి విద్యా ప్రగతిని ప్రమాణాలను పరిశీలించారు. పాఠశాల మౌలిక సదుపాయాలపై, విద్యార్థుల అభిప్రాయాలను సేకరించారు. పాఠశాలలో జూలై 5న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న మెగా పేరెంట్స్ కమిటీ సమావేశం ప్రత్యేక ఆకర్షణగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. పాఠశాల సిబ్బందితో సమావేశం నిర్వహించి, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు డివైఇఒ తెలిపారు. తల్లికి వందనం అనే నేపథ్యంపై విద్యార్థుల కోసం వ్యాసరచన, వక్తృత్వ ,క్విజ్, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర పోటీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉదయం 9:30లోపు హాజరు నమోదు చేయాలని, ఉపాధ్యాయుల సెలవులపై ముందస్తు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. సాధారణ సెలవులు ఒకరోజు ముందు దరఖాస్తు చేయాలని అత్యవసర పరిస్థితుల్లో ఆ రోజు ఉదయం 7గంటల లోపు సెలవు దరఖాస్తు చేయాలని, . ఫేషియల్ అటెండెన్స్ తప్పనిసరిగా ఉదయం 9గంటల లోపు, సాయంత్రం 4గంటల తర్వాత నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ నిబంధనలు పాటించనట్లయితే సంబంధిత సిబ్బందికి ఆ రోజు సెలవుగా పరిగణిం చబడుతుందని ఆయన హెచ్చరించారు. విద్యాశాఖ కమిషనర్ విజయ రామారావు ఆదేశాల ప్రకారం, ప్రతిరోజూ హాజరుపై స్వయంగా కమీషనర్ సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. ఈ తనిఖీలో ఎంఇఒ కరీముల్లా, ప్రధానో పాధ్యాయులు జయమ్మ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-నందలూరు

మండల కేంద్రం నందలూరులో డాక్టర్ పివి నరసింహారావు వైద్యశాలలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపుకు విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. కడప శ్రీశ్రీనివాస ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ బైన శ్రీనివాసరావు, డాక్టర్ అంపాపత్తిని గౌరీ(కార్డియాలజీ) ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నందలూరు పట్టణ ప్రాంత ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఉచిత మెడికల్ క్యాంపులో పాల్గొన్నట్లు తెలి పారు. ఉచిత క్యాంపుకు వచ్చిన రోగులందరికీ డాక్టర్ పృథ్వి ఉచిత ఓపితో పాటు ఇసిజి, టుడి ఎకో వంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శ్రీ శ్రీనివాస హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, టెక్నీషియన్లు వైద్య పరీక్షలు బాగా చేశారని రోగులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పివి.నరసింహారావు, డాక్టర్ పృధ్వి, హెచ్ఆర్ మేనేజర్ సుధాకర్, టెక్నీషియన్ షహమీర్, ఫార్మసీ ఇన్‌ఛార్జి లీలాకృష్ణ పాల్గొన్నారు.



రోగులకు 2డి ఎకో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

దూసుకుపోలేకున్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వం

- పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో కూటమికి చెందిన డబుల్ ఇంజిన్ సర్కార్ దూసుకుపోవడంలేదని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు తమ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం దూసుకుపోతోందని అనడం హాస్యాస్పదమన్నారు. కూటమి ప్రభుత్వం అప్పుల్లో దూసుకు పోతోందన్నారు. అభివృద్ధిలో చతికిల పడిందని విమర్శించారు. అంకె వేసిందని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. 2023-24లో కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన గ్రాంట్ రూ.34,698 కోట్లు కాగా, 2024-25లో రూ.20,135 కోట్లు మాత్రమే వచ్చిందని చెప్పారు. కూటమి ప్రభుత్వ పాలనలో గ్రాంట్ రూ.14,563 కోట్లు తగ్గిందని తెలిపారు. సంజీవినీ వంటి ప్రత్యేకహోదా రాలేదన్నారు. జిఎస్‌టి వసూళ్లు అన్ని రాష్ట్రాల్లో పెరుగు తూంటే ఎపిలో తగ్గుతున్నట్లు చెప్పారు. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిందని పేర్కొ న్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో రియల్ ఎస్టేట్ భారీగా పతన మైందని తెలిపారు. కూటమి విజయోత్సవ సభలో తొక్కి నార తీస్తాం వంటి వ్యాఖ్యలను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాట్లాడడం అనుచితమన్నారు. పవన్ తీరు మార్చుకోవాలని సూచిస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

'ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్'కు 63 మంది ఎంపిక

ప్రజాశక్తి-కలకడ

ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ పరీక్షకు 63మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గోవిందు తెలిపారు. మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో గత ఏడాది ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు నిర్వహించిన ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షల విభాగంలో ఆంగ్లం, లెక్కలు, సైన్స్, సోషియల్ సబ్జెక్టులలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు హాజరైన 63 మంది విద్యార్థులలో ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థి చరణ్ చౌదరికి రాష్ట్రస్థాయిలో ఏడవ ర్యాంకు సాధించడంతో అతనికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.700లు నగదు, ప్రశంస పత్రం అందించినట్లు తెలిపారు. మిగిలిన 62 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించినట్లు తెలిపారు. పాధ్యాయులు, పాఠశాల చైర్మన్ రమేష్ నాయుడు, వైస్ చైర్మన్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డిని ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

27న క్రికెట్ టోర్నమెంట్

-ఎంపిపిని ఆహ్వానించిన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని అరవపల్లి యూత్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటును జనాబ్ ఎస్టీ కాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ట్రస్ట్ అధ్యక్షులు కరిముల్లా ఖాన్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలు, ఆపై మంటపంపల్లి, గుంటిగాడిపల్లి, చింతరాజు పల్లి, మందపల్లి, ఆకేపాడు, గుండ్లూరు, హస్తవరం, బోయినపల్లి, తాళ్లపాక టీంలు మాత్రమే ఆడటానికి అర్హులని అన్నారు. నందలూరులో వర్క్ చేసే రైల్వే ఎంప్లాయిస్, ప్రభుత్వ ఉద్యోగులు ఆడవచ్చుని పేర్కొన్నాఉ. మొదటి బహుమతి రూ.30వేలు జనాబ్ ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్, రెండవ బహుమతి రూ.20వేలు, ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గ్రూప్ బెంగళూరు అందించనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు చివరి తేదీ ఈనెల 26వ తేదీ లోపు రూ.1200లు చెల్లించాలని అన్నారు. ఈ టోర్నమెంట్ కు ముఖ్యఅతిథిగా ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డిని కమిటీ సభ్యులు ఆహ్వానించారు. అవకాశాన్ని క్రికెట్ క్రీడాకారులు వినియోగించుకోవాలని కోరారు.

తహశీల్దార్‌ను సన్మానిస్తున్న దళితవేదిక నాయకులు

తహశీల్దార్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన క్రాంతికుమార్‌కు దళిత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్కిరెడ్డిపల్లి ఓబులేసు ఆధ్వర్యంలో దళిత వేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ మండల పరిధిలోని ఎస్‌సి, ఎస్‌టి భూ సమస్యలకు త్వరితగా సమస్యల పరిష్కారం చూపాలని తహశీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో దళిత వేదిక మండల అధ్యక్షులు ఈటెల వెంకటరమణ, మండల కన్వీనర్ దిన్నెపాటి ఓబులేసు, మండల గౌరవ సలహాదారులు శ్రీనివాసులు, చక్రాయిపేట మండలం కన్వీనర్ ఆంజనేయులు, ఊతయ్య, బాబు, నాగరాజు, రవి పాల్గొన్నారు.

పిఎం సూర్య ఘర్ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర ప్రభుత్వం రాయితీతో ఇచ్చే పిఎం సూర్య ఘర్ యోజనను గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఇ రమణ సూచించారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో మంగళవారం కేజి సోలార్ సిస్టం ఇంటలేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు పిఎం సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సు నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా ఎస్ఇ రమణ మాట్లాడుతూ రూఫ్ టాప్ సోలార్ పవర్ నెట్ మీటరింగ్ సిస్టమ్ ద్వారా కరెంటు బిల్లును 90 శాతం తగ్గించుకోవచ్చు అన్నారు. ఇళ్లకు ఉచిత విద్యుత్తును అందించడం కోసం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ పథకం కింద ఇళ్ల పైకప్పులపై సౌర ఫలకాలను ఏర్పాటు చేసుకోవడానికి సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిఇ ప్రసాద్ రెడ్డి, ఎడిఎ నాగేంద్ర ప్రసాద్, కేజి సోలార్ సిస్టం సిస్టం కాం ట్రాక్టర్ వెంకట రమణా రెడ్డి,పాల్గొన్నారు.

జిల్లాలో రూ.600 కోట్లు బకాయిలు : జిల్లాలో రూ.600 కోట్లు గ్రామపంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పవర్ లిఫ్టింగ్ తదితర వాటి నుంచి విద్యుత్తు బకా యలు ఉన్నాయని విద్యుత్ శాఖ ఎస్ఇ రమణ పేర్కొన్నారు. వేంపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్నిరకాల వాటికి సంబంధించి రూ.21 కోట్లు మొండి బకాయిలు ఉన్నాయన్నారు. గత ఏడాది స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సుమారు రూ.700 కోట్లు వసూలు చేశామన్నారు. ఇంధన సర్దు బాటు ఛార్జీలతో వినియోగదారులకు అధిక బిల్లులు వస్తాయని చెప్పారు. ఈ బిల్లులు 2026 మార్చి వరకు కొనసాగుతాయన్నారు. ఇఇ ప్రసాద్‌రెడ్డి, డిఇ నాగేంద్ర, ఎఇ ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ఎంపిపికే రక్షణ లేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): కూటమి ప్రభుత్వంలో ప్రొద్దుటూరు ఎంపిపికే రక్షణ కరువైందని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని దొరసానిపల్లె తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతోమాట్లాడుతూ కొత్తపల్లి పంచాయతీలోని ఖాదరబాద్‌లో ఎంపిపి శేఖర్ యాదవ్ 489-2 సర్వే నంబర్‌లో 10 సెంట్లు స్థలాన్ని రూ.1.2 కోట్లకు కొనుగోలు చేశారన్నారు. 1982లో ఉప్పరపల్లికు చెందిన వీరారెడ్డి 35 ప్లాట్లతో ఒక వెంచర్ ఏర్పాటు చేశారన్నారు. చాలామంది చేతులు మారుతూ చివరగా గజ్జల భారతీదేవి నుండి శేఖర్ యాదవ్‌కు అమ్మారన్నారు. ఎమ్మెల్యే వరదరాజు రెడ్డి అత్యంత ముఖ్య అనుచరులు దారా భాస్కర్‌రెడ్డి, బావమరిది కేశవరెడ్డి నుండి కొనుగోలు చేశారన్నారు. ఇంతలో వైసిపి నుండి టిడిపికి వెళ్లిన నాయకులు కౌన్సిలర్ మునీర్, కొత్తపల్లి సర్పంచ్ శివచంద్రారెడ్డి వారి అనుచరుల కన్ను ఈ ప్లాట్లపై పడి నకిలీ దస్తావేజులు పుట్టించి ఆ స్థలం మాదని ఎంపిపి, అతని భార్యపై దాడి చేశారన్నారు. ఎంపిపి పలుమార్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా టిడిపి నాయకులు సరైన పత్రాలు తీసుకరాలేక కేవలం సెటిల్‌మెంట్‌కే పిలుస్తున్నారని రాచమల్లు తెలిపారు. ఇంత అవినీతి జరుగుతున్నా ఎమ్మెల్యే అంటీఅంటనట్లు ఉన్నారన్నారు. ఎంపిపి స్థలానికే భద్రత లేకపోతే సామాన్య ప్రజలకు ఏం న్యాయం చేస్తారని విమర్శించారు.